గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని మంత్రికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న యాదగిరియాదవ్, ప్రేమ్‌కుమార్

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ పాఠశాల, జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకరించాలని గురుకుల్ పూర్వ విద్యార్థులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి అందజేశారు. మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, ప్రేమ్‌కుమార్, అహ్మద్, ప్రసన్న, నందరాజ్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ పోస్టర్ ఆవిష్కరణ



ఘట్‌కేసర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ధర్మేందర్, నాయకులు

ఘట్‌కేసర్: వచ్చేనెల 1, 2 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ ఈసీఐఎల్‌లో జరుగనున్న కౌన్సిల్ సమావేశంలో మొదటి రోజు సాంకేతికత అభివృద్ధి, నిరుద్యోగ సమస్య అన్న అంశంపై సమావేశం ఉంటుందని చెప్పారు. కౌన్సిల్ సమావేశాలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివ, వెంకటేశ్వర్లు, బాబు, సంపత్, పరమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ముగిశాయి. సేవాకాలం, ద్వారతోరణ పూజ, సంతాన ఇష్టి, 108 కలశాలతో అభిషేకం, చక్రస్నానం, వసంతోత్సవం, పుష్ప యాగం, రుత్విక్ సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పన్నాల కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ అంజి పటేల్, భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అపర్ణ కెనోపి సమీపంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాసా త్రైయంబక్ బిల్డర్స్ వారు తమ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన మురుగు డ్రైనేజీ ద్వారా బయటకు పంపకుండా ఇష్టానుసారంగా వదలడంతో నిత్యం రోడ్డుపై డ్రైనేజీ పారుతోందని, తమ అపర్ణ కెనోపి జాస్మిన్ వరకు మురుగు చేరుతోందని, దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నామని, ప్రధాన రోడ్డు గుంతలుగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి మురుగు నీటిని బయటకు వదులుతున్న వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు.

ఏపీలోని టీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

మల్లాపూర్: తెలంగాణలోని చాలామంది ఉపాధ్యాయులు రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండిపోయారని, తెలంగాణ ప్రభుత్వంలో బదిలీల విషయంలో న్యాయం జరగలేదని కోరతూ ఉపాధ్యాయులు మంగళవారం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బొంగోని ఉమేష్‌గౌడ్, మొసలి శ్రీనివాస్‌రెడ్డి, జోష్ విక్టరీ తదితరులున్నారు.

మహిళ అదృశ్యం



మాధవి(ఫైల్)

అల్వాల్: ఫోన్ ఎక్కువగా మాట్లాడుతోందని భర్త మందలించడంతో భార్య అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ ఆదర్శ నగర్ కాలనీలో గోరంట్ల రవి, భార్య మాధవి నివాసం ఉంటున్నారు. మాధవి తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో భర్త రవి మందలించాడు. దీంతో వారిద్దరికి గొడవ జరిగింది. ఈ నెల 17వ తేదీన సాయంత్రం రవి ఇంటికి వచ్చి చూసేసరికి మాధవి కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచీకరణలో కూలిన బతుకులు

పునాదులు మొదలుకొని రంగులు వేసే వరకు..

కార్మికుల జీవితాలను మార్చాలని వేడుకోలు

వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చి జీవనం

స్థలాలు కేటాయించి ఇళ్లను ఇవ్వాలని వేడుకోలు



జవహర్‌నగర్.. ఒకప్పుడు నగరానికి దూరంగా విసిరేసినట్టు ఉండేది.. అభివృద్ధికి దూరంగా.. పేదలు నివసించేందుకు అనుకూలంగా ఉండేది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి సైతం ఎంతో మంది నిరుపేదలు పొట్టచేతబట్టుకొని నగరానికి వలస వచ్చేవారు. నగరంలో అద్దెలు అధికంగా ఉండటంతో ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఇక్కడ నివసించే వారంతా పేదలే కావడంతో నగరానికి వెళ్లి చిన్నచిన్న పనులు చేసుకొని తిరిగి వస్తుంటారు. ఇక్కడ నివాసం ఉండేవారిలో అత్యధికంగా భవన కార్మికులుగా పనిచేస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కో పని చేస్తూ అందరూ కలిసి అందమైన భవనాలు పూర్తి చేస్తున్నారు. ఎంత కష్టపడ్డా వారి జీవన స్థితిగతులు మెరుగుపడకపోవడంతో ప్రభుత్వం నుంచి చేయూత కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ బతుకుల్లో వెలుగులు తీసుకురావాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. - జవహర్‌నగర్

రాళ్లను కొడుతున్న కార్మికులు



పునాదులు తవ్వడం, ఇంటి నిర్మాణం పూర్తిచేసి గోడలకు రంగులు వేయడం.. ఉడ్‌వర్క్, సీలింగ్ వరకు అన్ని రంగాల కార్మికులు జవహర్ నగర్ కార్పొరేషన్‌లోనే ఉంటారు. ఎవరైనా ఇల్లు నిర్మించుకోవాలంటే కంగారు పడాల్సిన అవసరం లేదు. ఈ ప్రాంతానికి వస్తే చాలు.. గృహ నిర్మాణదారుడి సమస్యకు పరిష్కారం దొరికినట్లే.. పంటలను సాగు చేసేందుకు నీళ్లు లేక ఉపాధి వెతుక్కుంటూ ఒకరు మొదలు పెట్టిన ప్రస్థానం ఇప్పుడు ఊరంతా భవన నిర్మాణ కార్మికులుగా మారేటట్లుగా చేసింది. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో దాదాపు 3 లక్షల మంది జనాభా నివస్తున్నారు. 75వేల మంది ఓటర్లు ఉన్నారు. పట్టణ జనాభాలో 90శాతం భవన నిర్మాణ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఒక్కొక్కరు భవన నిర్మాణ రంగం వైపు దృష్టి సారించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జీవన విధానంలో ఎన్నో మార్పులు.. ప్రభుత్వ రంగంలో ఉపాధి కరువై, ప్రైవేట్ వ్యవస్థ కుప్పకూలడంతో చాలామంది కార్మికులకు సరైన పనులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేట్ సంస్థలు రంగంలోకి దిగడంతో కార్మికుల బతుకులు ఆగం అయ్యాయి. కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.

నిర్మాణ రంగంపైనే జీవిస్తున్న జవహర్‌నగర్ ప్రజలు



జవహర్‌నగర్‌లో తలుపు రెక్కలను తయారు చేస్తున్న కార్పెంటర్లు



పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ రంగానికి కేరాఫ్



భవన నిర్మాణ రంగానికి పెట్టింది పేరు జవహర్‌నగర్. ఎక్కువ శాతం వివిధ జిల్లాల నుంచి వలస వచ్చి ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ స్థిరపడ్డారు. ఉన్నత చదువులు చదివినా వారికి తగిన ఉద్యోగాలు రాకపోవడంతో ఈ రంగంపైనే దృష్టి సారించారు. భవనాలు నిర్మించడంలో మంచి నైపుణ్యం సాధించారు. పట్టణంలో 90 శాతం మంది కార్మికులే.

- బూడిద వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

కార్పెంటర్ల బతుకులు మారడం లేదు



సమాజంలో కార్పెంటర్లు దుర్భర జీవితం గడుపుతున్నారు. జవహర్‌నగర్‌లో దాదాపు 6వేల మంది వలస వచ్చి కార్పెంటర్లు వృత్తిని కొనసాగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పనిచేసినా కూలీ గిట్టుబాటు కావడం లేదు. ప్రస్తుత ప్రపంచీకరణలో ఎంత పోటీపడ్డా ఫలితం కనిపించడంలేదు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం కార్పొరేషన్ నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి.

- బాషపల్లి రమేష్‌చారి, విశ్వబ్రాహ్మణ ఐక్యసంఘం మేడ్చల్‌జిల్లా అధ్యక్షుడు



రాళ్లను కొడుతున్న కార్మికులు

నేడు ఎన్‌ఎన్‌ఆర్‌జీలో టెక్, ఫార్మా సంప్రతి

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి విద్యాసంస్థల్లో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు జాతీయ స్థాయిలో టెక్, ఫార్మా సంప్రతి – 2025 నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డా.సీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా సైంట్ లిమిటెడ్ ఫౌండర్ చైర్మన్ డా.బీవీఆర్ మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా కల్చరల్ ఫెస్ట్ తారా–2025 జరుగుతుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సాంకేతిక రంగానికి సంబంధించిన పేపర్ ప్రజెంటేషన్లు ఉంటాయన్నారు. యాప్ ఎక్స్‌పో, రోబో ప్లే, క్యాడథాన్, సీ హంట్, మైండ్ ఫ్రీక్, టెక్నోవేషన్, నాలెడ్జ్ నిన్‌జాస్, పేపర్ ప్రజెంటేషన్లు, ప్రో చార్ట్స్, షార్ట్‌ఫిల్మ్, ఈ స్పోర్ట్స్, ఎలక్ట్రోకామ్ బ్లూజమ్స్ వంటి ఈవెంట్స్ ఉంటాయని తెలిపారు.

చీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో..



చీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో నవీన్ మిట్టల్ దంపతులు

కీసర: చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి సేవలో రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ కుటుంబసమేతంగా మంగళవారం పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన నవీన్ మిట్టల్ దంపతులకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేయగా, ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

బ్రహ్మోత్సవాల్లో భోజన వసతి కల్పించడం అభినందనీయం

- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదితరులు

కీసర: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కీసరగుట్టలో శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమ కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో భక్తులతో పాటు విధులు నిర్వర్తించే పోలీస్, వివిధ శాఖల అధికారులకు ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించడం అభినందనీయం అన్నారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ రాయిల శ్రావణ్‌గుప్తా, అధ్యక్షుడు బెలిదే రమేష్‌గుప్తా, కోశాధికారి బి.నాగేష్‌గుప్తా, సభ్యులు రాజుగుప్తా, సాయినాథ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



పోస్టుకార్డుల ఉద్యమం నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

అల్వాల్: ఉద్యమకారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్‌రావు అన్నారు. అల్వాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ఉద్యమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 250 గజాల చొప్పున స్థలం కేటాయించాలని, గుర్తింపు కార్డులను కేటాయించాలని, బస్‌పాస్‌లను ఇవ్వాలని, స్వాతంత్ర్య సమరయోధులకు ఏ విధంగా బెనిఫిట్స్ ఇచ్చారో అలాగే తెలంగాణ ఉద్యమకారులకు కూడా ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం జనరల్ సెక్రటరీ పట్నోళ్ల సురేందర్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుండు దయానంద్, మల్కాజిగిరి ఫోరం అధ్యక్షులు పుట్నాల కృష్ణ, కొండ స్వామి, బాబు, పోచన్న, అనిల్, ఆనంద్, అనంతలక్ష్మి, నస్రీన్, శోభ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణ ముఖ్యమే..



వైద్య శిబిరంలో అంకుర ఆస్పత్రి సిబ్బంది తదితరులు

ఉప్పల్: విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా విద్యార్థులకు ముఖ్యమేనని అంకుర ఆస్పత్రి వైద్యనిపుణులు డా.సుధారాణి అన్నారు. ఉప్పల్ బబుల్జ్ ప్రైమరి స్కూల్‌లో యాజమాన్యంతో కలిసి నిర్వహించిన వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ వైద్య శిబిరాలు ఆరోగ్య అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు అరోగ్య అంశాలపై అవగాహన పెంచుతాయన్నారు. కార్యక్రమంలో డాకర్లు చందన, మృదుల, హర్షిత, పాఠశాల ప్రిన్సిపల్ చందన శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేయాలని వినతి



కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఇందిరానగర్ కాలనీ వాసులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లోని రోడ్ నంబర్–09, 10లో సీసీ రోడ్డు పనులను చేపడుతామని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. రోడ్లు వేయాలని కోరుతూ ఇందిరానగర్ కాలనీవాసులు కార్పొరేటర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఫారుక్, ఫాహిమ్, అబ్దుల్, స్టీఫెన్, జయరాజ్, అన్వర్ పాషా, జూబేదా బేగం, సయ్యద్ ముషారఫ్, యాసిన్, ప్రభాకర్, వసీమ్, హైదర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

పోచారంలో కబ్జాల పర్వం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని కాచవాని సింగారంలో సర్వే నంబర్–54లో చేసిన లేఅవుట్‌లో భాగ్యనగర్ నందనవనం పార్కును కబ్జా చేశారంటూ హైడ్రా అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. 1997లో 340 ప్లాట్లతో లేఅవుట్ చేయగా, 2007లో 110 ప్లాట్లతో గ్రామ పంచాయతీ లేఅవుట్‌గా తీర్మానం చేశారు. దీన్నే 2006లో కొన్నట్లు చూపించి, 2010లో హెచ్‌ఎండీఏ అనుమతి కోసం కబ్జాదారులు దరఖాస్తు చేసుకున్నారు. అనుమతి లభించకపోయినా దివ్యానగర్ ప్లాట్ ఓనర్ల సంక్షేమ సంఘం ఆ ప్లాట్లను అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

– జయపురి కాలనీలో ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. 1968లో దాదాపు 56 ఎకరాల్లో చేసిన గ్రామపంచాయతీ లేఅవుట్‌లో స్థలాలను ఆక్రమించుకొని విల్లాలు కట్టుకున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలను హైడ్రా కమిషనర్‌కు చూపించారు.

– కొర్రెముల్‌లోని ఏకశిలానగర్ కాలనీలో ఉన్న పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జా చేస్తున్నారని, కాలనీకి వెళ్లే 50 అడుగుల రహదారిలో 15 అడుగుల మేర అక్కడి ఇంజినీరింగ్ కళాశాల వారు ఆక్రమించి వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించని మార్బుల్ షాప్ సీజ్



మార్బుల్ షాపును సీజ్ చేస్తున్న అధికారులు

ఉప్పల్: ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకపోవడంతో మంగళవారం ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు మార్బుల్ షాప్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ హైదరాబాద్ మార్బుల్ షాపునకు సంబంధించి రూ.38 లక్షలు ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని నోటీసులు ఇచ్చామని, అయినా స్పందించకపోవడంతో షాప్‌ను సీజ్ చేశామని తెలిపారు.

బైక్ చోరీ చేసిన నిందితుడికి రిమాండ్

ఘట్‌కేసర్: బైక్ చోరీ నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ పట్టణం మేడపాటినగర్‌కు చెందిన సప్పిడి యశ్వంత్‌రెడ్డి బైక్ చోరీ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన ఘట్‌కేసర్ పోలీసులు నిందితుడు మహబూబ్‌నగర్ పాతపాలెంకు చెందిన వడ్డె రాజు(33)ను అరెస్ట్ చేశారు. అతడి దగ్గరి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

కొత్త టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు

- డిజిటల్ యుగం వైపు నిపుణులు పరిశోధనలు చేయాలి
- బిట్స్ పిలానీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ



జవహర్‌నగర్: బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో మంగళవారం వైర్ లెస్ వరల్డ్ రీసెర్చ్ ఫోరం (డబ్ల్యూడబ్ల్యూఆర్‌ఎఫ్) అనే కార్యక్రమాన్ని బిట్స్ పిలానీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ ప్రారంభించారు. కార్యక్రమానికి యూనివర్సిటీ ఆఫ్ ఔలూ ప్రొఫెసర్ మట్టి లాత్వా – అహో, డబ్ల్యూడబ్ల్యూఆర్‌ఎఫ్ చైర్మన్ డాక్టర్ నిలెల్ జెఫెరీస్ హాజరై మాట్లాడుతూ.. పర్యావరణ మార్పులకు అనుగుణంగా కాలంతో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోందని, ఏఐ వంటి సాంకేతికతతో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. డిజిటల్ యుగం వైపు నిపుణులు పరిశోధనలు చేయాలన్నారు. 6జీ, ఏఐ, ఐఓటీ కొత్త టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు సాధించవచ్చన్నారు. సదస్సులో వివిధ దేశాల నుంచి 30 మందికిపైగా ప్రపంచ నిపుణులు, వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఆర్‌ఎఫ్ వైస్ చైర్మన్ భారత్ భాటియా, పరిశ్రమల ప్రముఖులు, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



కుషాయిగూడలో యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న కుషాయిగూడ వేంకటేశ్వర స్వామి ఆలయ పక్క వీధిలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి మంగళవారం ఆమె యూజీడీ పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేశారన్నారు. చాలా రోజుల క్రితం వేసిన డ్రైనేజీ కావడంతో సామర్థ్యం తగ్గి తరచూ వీధుల్లో మురుగు పారుతూ సమస్య తలెత్తడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు యూజీడీ పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ సందీప్, ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా యూజీడీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పూర్తిస్థాయి సర్వే నిర్వహించాలి

- రాష్ట్ర బీసీ కమిషనర్ సభ్యురాలు బాలలక్ష్మి



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషనర్ సభ్యురాలు బాలలక్ష్మి

మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే పూర్తిస్థాయిలో నిర్వహించి క్షేత్రస్థాయిలో వివరాలను పొందు పర్చాలని రాష్ట్ర బీసీ కమిషనర్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయంలో కులగణనపై మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు, వార్డు అధికారులకు సర్వేకు సంబంధించిన దిశానిర్దేశం చేయాలని కమిషనర్ త్రిలేశ్వర్‌రావుకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని వినతి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

అల్వాల్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల కుటుంబాలు ఉపవాస దీక్షలు చేసే సమయంలో తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అధికారుల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని మసీదుల సదర్లతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. శానిటేషన్ సిబ్బంది ప్రణాళికబద్ధంగా పనిచేసేలా చూడాలని కోరారు. పాతబస్తీలో ఏర్పాటు చేసిన విధంగా రాత్రి సమయాల్లో షాపింగ్‌కు మల్కాజిగిరిలో కూడా సముదాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. మల్కాజిగిరి నియోజకవర్గ ముస్లిం పెద్దలు, మసీదుల సదర్లు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387